క్లుప్తంగా

గంగమ్మకు బోనాలు



ఉయ్యాలవాడలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

ఉయ్యాలవాడ: మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో గంగమ్మకు బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రజలంతా సుఖసంతోషాలతో జీవనం సాగించేలా దీవించాలని గంగమ్మను వేడుకున్నారు. గ్రామంలో ఇంటింటి నుంచి మహిళలు బోనాలతో ప్రధాన కూడలిలోకి చేరుకుని సమష్టిగా ప్రధాన రహదారి వెంట మంగళ వాయిద్యాలతో గ్రామం వెలుపల ఉన్న గంగమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

శనగ విత్తనశుద్ధి తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాదరావు

నంద్యాల(అర్బన్): శనగ విత్తుకొనే ముందు రైతులు 8 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీతో విత్తన శుద్ధి చేసుకుంటే పంటకు సోకే ఎండు తెగులును నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని మిట్నాల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులకు 25 శాతం సబ్సిడీతో 150 క్వింటాళ్ల శనగ విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం వరిని ఆకుముడత పురుగు ఆశించిందని, సమగ్ర పోషకాల యాజమాన్యం ద్వారా దానిని నివారించుకోవచ్చన్నారు. అధికారులు మల్లీశ్వరి, మణిమోహన్‌రెడ్డి, సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుకు ఝలక్

నంద్యాల(సిటీ): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. నంద్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున గుప్తా సోమవారం తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణం శ్రీనివాస నగర్‌లో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నంద్యాల పట్టణానికి చెందిన సుర మహేష్ మద్యం సేవించి బైక్ నడుపుతూ పట్టుబడ్డాడు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా జడ్జి 5 రోజుల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారని వెల్లడించారు.

చేతివృత్తిదారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): చేతివృత్తిదారులకు 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని ఏపీ చేతివృత్తిదారుల సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాంమోహన్, వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం నంద్యాలలో సీపీఐ ఆధ్వర్యంలో చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేతివృత్తిదారులు ఎంతో నైపుణ్యంతో పనులు చేసుకుంటూ చాలీచాలని ఆదాయంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, శ్రీకాంత్, బాలకృష్ణ, రంగస్వామి, సుబ్బరాయుడు, పవన్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

ఆలస్యంగా సమస్యల పరిష్కార వేదిక

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో అధికారులు మంగళవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు వేచిచూసి విసిగిపోయారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే అఖిలప్రియ అధ్యక్షతన కార్యక్రమం ఉంటుందని, ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు అందించవచ్చని అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చారు. దీంతో మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే సమయానికి రాకపోవడంతో సాయంత్రం వరకు ఎదురుచూసి విసిగిపోయారు. సాయంత్రం ఎమ్మెల్యే వచ్చి వేదిక మీదకు చేరుకోగానే వర్షం ప్రారంభమైంది. చేసేది లేక ఆరుబయట ఏర్పాటు చేసిన వేదికను వదిలి మండల పరిషత్ సమావేశ భవనంలో కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే వాటిని ఆయా శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తహసీల్దారు మల్లికార్జున రావు, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ఉన్నారు.

బైక్ దొంగ అరెస్టు

నందికొట్కూరు: పట్టణంలో గత నెల 25వ తేదీన బైక్ చోరీ జరిగినట్లు బాధితుడు కుర్వపేట మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కోటవీధిలో బాడుగ ఇంట్లో నివాసం ఉంటున్న ఆత్మకూరు పట్టణానికి చెందిన ఖాదర్‌బాషాను అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించడంతో బైక్ దొంగతనాలను ఒప్పుకున్నట్లు చెప్పారు. అతని నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు టౌన్ సీఐ చెప్పారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలుడు క్రిష్టిపాడు గ్రామానికి చెందిన సుదీక్షిత్. ఈ యేడాది 1వ తరగతిలో చేరాల్సి ఉండగా ఆధార్ కార్డు లేకపోవడంతో అడ్మిషన్ నమోదుగాక ఇంటివద్దనే ఉంటున్నాడు. తొలిసారి ఆధార్ నమోదు చేసేప్పుడు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం ఉండాలి. ఈ బాలుడికి జనన ధ్రువపత్రం ఉన్నప్పటికీ రెండు సార్లు తిరస్కరించారు. కారణం ఏమిటని అడిగితే ఎవ్వరూ సమాధానం చెప్పలేకపోతున్నారు. ఫలితంగా మూడోసారి ఎన్‌రోల్ చేయించారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలుడు క్రిష్టిపాడుకు చెందిన ప్రసాద్. 9వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థికి ఆధార్ కార్డులో పుట్టిన తేదీ 2006 జూన్ 20 అని నమోదై ఉంది. కానీ స్కూల్ రికార్డుల్లో 2010 మే 5 అని ఉంది. స్కూల్ ప్రకారం మార్చమని కోరితే తప్పనిసరిగా బర్త్ సర్టిఫికెట్ తీసుకురావాలని కోరడంతో ఇంటికి వచ్చాడు. ప్రస్తుతం బర్త్ సర్టిఫికెట్ పొందడం ఎలా అని ఇబ్బందులు పడుతున్నారు.

అందుబాటులో ఆధార్ సేవలు

- 25 వరకు కొనసాగనున్న ప్రత్యేక శిబిరాలు
- మార్పులు, చేర్పులకు అవకాశం



క్రిష్టిపాడు సచివాలయంలో ఆధార్ సేవలందిస్తున్న సిబ్బంది

దొర్నిపాడు: సంక్షేమ పథకాల లబ్ధి పొందాలన్నా.. పాఠశాలలో చేరాలన్నా.. ఉద్యోగం చేయాలన్నా.. ఆఖరుకు మొబైల్‌కు సిమ్ తీసుకోవాలన్నా ఆధార్ కార్డు ఆధారమైంది. తరచూ ఆధార్‌కు నవీకరణ, మార్పులకు సంబంధించి జనం మీసేవా కేంద్రాలు, సచివాలయాలు, ఆధార్ సర్వీస్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. కాగా అందరికీ అందుబాటులో లేకపోవడంతో దూరంగా ఉన్నవారికి సేవలు పొందడం భారంగా మారింది. దీంతో గత ప్రభుత్వం సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను తీసుకొచ్చింది. ఇది పల్లెవాసులకు మంచి సత్ఫలితాలను ఇస్తోంది. ప్రస్తుతం అధికారులు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు ప్రజలకు చేరువలో ఆధార్ సేవలు అందించేలా చర్యలు చేపట్టారు.

ప్రస్తుతం చాలా సందర్భాల్లో ఆధార్ ప్రామాణికంగా మారింది. బ్యాంకు ఖాతాలు తెరవడానికి విద్యా, వైద్యం చిరునామా, వయస్సు, ఇలా అన్నింటికీ దీన్నే పరిగణలోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆధార్ తీయించుకొని పదేళ్లు దాటిని వారికి నవీకరణ తప్పనిసరి చేశారు. దీనిలో భాగంగానే వేలిముద్రలు, కంటిపాప (ఐరిస్) నమోదు చేస్తారు. ఇక వీటితో పాటు చాల మందికి నివాసం, వయస్సు, పేర్లలో తేడాలు ఉండటం వంటి సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి వాటిని సరిచేయించుకోవడానికి సచివాలయాల్లో ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశారు. దొర్నిపాడు, గుండుపాపల గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు సవరణలు చేస్తున్నారు.

విద్యార్థులకు తప్పని పాట్లు

ప్రస్తుతం విద్యార్థులు ఆధార్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మందికి ఆధార్‌లో పుట్టిరోజుకు స్కూల్ రికార్డుల్లో పుట్టిన తేదీకి తేడాలు ఉన్నాయి. సవరణ కోసం శిబిరానికి వెళ్లగా జనన ధ్రువీకరణ పత్రం ఉంటేనే సరిచేస్తామని డిజిటల్ సహాయకులు పేర్కొంటున్నారు. లేకపోతే 10వ తరగతి ఒరిజినల్ మార్కులిస్టు తప్పనిసరి అంటున్నారు. కనీసం విద్యార్థుల కోసం అయినా ఆధార్ నిబంధనల్లో మార్పులు తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. స్కూల్ స్టడీ లేదా టీసీ ఆధారంగా సవరణలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేదంటే చాలా మంది విద్యార్థులు ప్రభుత్వం అందించే పథకాలను కోల్పోయే అవకాశం ఉంది.

ఒక్క అక్షరం ఇబ్బందులకు గురిచేస్తోంది



నేను ప్రస్తుతం అమ్మిరెడ్డి నగరంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంటర్ చదువుతున్నాను. హిమబిందు పేరు ఆధార్ కార్డు, స్కూల్ రికార్డుల్లో తెలుగులో సరిగ్గానే ఉన్నప్పటికీ, ఇంగ్లీషులో మాత్రం ఒక్క అక్షరం మారింది. ఆ ఒక్క అక్షరం మార్చేందుకు తగిన ధ్రువపత్రాలు కావాలని వెనక్కు పంపారు. ఆధార్ కార్డు లేదా పదో తరగతి మార్కులిస్టు తీసుకొస్తే సవరిస్తామంటున్నారు. ఇలాంటి క్యాంప్‌లు పెట్టడం విద్యార్థులకు మంచి అవకాశం.

–హిమబిందు, అమ్మిరెడ్డినగరం

తేదీల వారీగా శిబిరాలు



మండలంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలను తేదీల వారీగా నిర్వహిస్తున్నాం. 22, 23న క్రిష్టిపాడు, కొండాపురం, 24న డబ్ల్యూ.గోవిందిన్నె, బుర్రారెడ్డిపల్లె, 25న డబ్ల్యూ. కొత్తపల్లె, చాకరాజువేముల గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. ఆధార్ కార్డుల్లో ఎమైనా సవరణలు ఉంటే వెంటనే సరిచేసుకోవచ్చు. సచివాలయ సిబ్బంది సహకారం అందిస్తారు. సవరణలకు సంబంధించి తగిన ధ్రువపత్రాలు అందించాలి.

–సావిత్రి, ఎంపీడీఓ, దొర్నిపాడు

అయోడిన్ లోపంతో థైరాయిడ్ ముప్పు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా బాల స్వాస్థ్య ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు

శిరివెళ్ల: అయోడిన్ లేని ఉప్పు వల్ల థైరాయిడ్ ముప్పు పొంచి ఉందని జిల్లా బాల స్వాస్థ్య ఆరోగ్య ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావు అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. అయోడిన్ లోపంతో మెదడు చురుగ్గా పని చేయదన్నారు. గొంతు సంబంధ వ్యాధి నివారణకు, రోగ నిరోధక శక్తి పెంచుకునేందుకు అయోడిన్ కలిగిన ఉప్పునే తీసుకోవాలన్నారు. పిల్లలో శారీరక, మానసిక వృద్ధికి మంచిదన్నారు. అయోడిన్ లేని ఉప్పును ప్రభుత్వం నిషేధించిందని చెప్పారు. గర్భిణుల్లో నాన్ అయోడిన్ ఉప్పు వాడకం వల్ల ఒక్కోసారి గర్భస్రావం జరిగే అవకాశం ఉందన్నారు. డాక్టర్లు దివ్య, ముఖేష్, సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలపై ఏకరువు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు సబ్సిడీ విత్తనాలపై ఏకరువు పెట్టారు. అజెండాలో పొందుపరచిన అంశాల్లో భాగంగా ముందుగా వ్యవసాయ శాఖపై చర్చకు రాగా మండల వ్యవసాయాధికారి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమైంది. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని వెల్లడించారు. సమావేశానికి హాజరైన గ్రామ సర్పంచ్‌లు దేశం సోమశేఖర్‌రెడ్డి, మేకల ఓబులేసు, పల్లె గురుప్రసాద్‌రెడ్డి, రామమద్దిలేటిరెడ్డి, నడిపెన్న, ఎంపీటీసీ సభ్యులు గగ్గెర వెంకటేశ్వర్లు, కపురం శివమ్మ మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉయ్యాలవాడ మండలంలో అత్యధికంగా రైతులు పప్పుశనగ సాగు చేస్తారన్నారు. మార్కెట్‌లో పప్పుశనగ క్వింటా రూ.6,600 ఉంటే ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలు క్వింటా రూ.7,050గా నిర్ణయించడం కూటమి ప్రభుత్వానికి రైతులపై కపట ప్రేమకు నిదర్శనమన్నారు. ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమై 20 రోజులు గడిచినా రైతులకు పెట్టుబడి సహాయం ఇంతవరకు ఇవ్వకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మండల విద్యాశాఖాధికారి వీరప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల పరిధిలో 25 ఎంపీపీ పాఠశాలలు ఉండగా 13 పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారని, ఆ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవుపై వెళితే బోధన కొనసాగించడం కష్టతరంగా మారిందన్నారు. ప్రస్తుతం హిందూపురంలో జరుగుతున్న శిక్షణా తరగతులకు ఉపాధ్యాయులు వెళితే ఇక్కడి విద్యార్థులకు విద్యనందించలేమని, ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు చెప్పారు. ట్రాన్స్‌కో ఏఈ గురప్ప మాట్లాడుతూ.. సకాలంలో బిల్లులు చెల్లించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు. వైద్యాధికారులు రాబర్ట్ కెనడీ, విజయదుర్గ మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులతో సమష్టిగా ఏర్పడి గ్రామాభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి తహశీల్దార్ శ్రీనివాసులు హాజరు కాకపోవడం గమనార్హం. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, మండల కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్, ఉద్యానవన శాఖ అధికారిణి ధరిణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



రైల్వే ఉద్యోగ సంఘాల ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శంకర్‌రావు

నంద్యాల(సిటీ) కార్మికుల జీవితాల్లో మార్పు కోసమే ఎన్నో దశాబ్దాలుగా పోరాటం చేసిన ఘనత దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌కే దక్కుతుందని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు అన్నారు. మంగళవారం రైల్వే ఉద్యోగ సంఘాల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నంద్యాలలో ప్రచారం చేశారు. స్థానిక మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్)లో అంతర్భాగమైన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ)కు డిసెంబర్ 4, 6వ తేదీలలో రైల్వే బోర్డు నిర్వహిస్తున్న ఉద్యోగ సంఘాల ఎన్నికలలో ఎస్‌సీఆర్ఎంయూను గెలిపించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం, పనివేళల్లో మార్పులు, ఉద్యోగుల బోనస్, వారాంతపు సెలవులను మజ్దూర్ యూనియన్ వల్లే సాధించామన్నారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు తమ గుత్తాధిపత్యం కోసం కార్మికుల కడుపు కొట్టేలా చట్టాలను తయారు చేస్తుంటే అడ్డుకున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌ను గెలిపించి కార్మికుల హక్కులను సాధించాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు డివిజనల్ కార్యదర్శి ప్రసాద్, అదనపు డివిజనల్ కార్యదర్శులు అబ్దుల్ హక్, శివకోటేశ్వరరావు, కరుణశ్రీ, నంద్యాల బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, కిరణ్‌కుమార్, రవిప్రకాష్ తదితరులు ఉన్నారు.

కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

శిరివెళ్ల: మండలంలోని ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు అదనపు భాధ్యతలను అప్పగించినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప మంగళవారం తెలిపారు. మూడు గ్రామ పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులు లేక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కామినేనిపల్లె గ్రామ పంచాయతీకి కోటపాడు కార్యదర్శి మనోహర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించామన్నారు. బోయలకుంట్లకు గంగవరం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మహదేవపురం కార్యదర్శి వెంకట రమణ భట్టును గోవిందపల్లెకు ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నియమించామన్నారు.

రేపు కబడ్డీ, షటిల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లా కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనాథ్ మంగళవారం తెలిపారు. నంద్యాల మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు. అలాగే షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నంది అకాడమీలో జరుగుతాయని వివరించారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఎంట్రీ బీఫారంను తీసుకురావాలన్నారు. అలాగే ఇంటర్ విద్యార్థులు అయితే పదవ తరగతి మార్కులిస్టు జిరాక్స్ తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలో పాల్గొన్న క్రీడాకారులు మాత్రమే జిల్లా స్థాయిలో పాల్గొనే విధంగా ఇన్‌చార్జ్‌లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. క్రీడలకు హాజరయ్యే వారందరికీ నంది గ్రూప్ ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలను ఉమ్మడి జిల్లాల విద్యాశాఖాధికారులు సామేలు, సుధాకర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఉచిత బస్సు హామీ అమలు చేయకపోతే ఉద్యమం

నంద్యాల(అర్బన్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి పార్టీలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయాలని కోరుతూ.. పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్లు నంద్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పోస్టుకార్డు ఉద్యమంపై స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీల్లో బాగంగా మహిళలకు ఉచితబస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు దాటినా హామీల అమలు అతీగతీ లేకుండా పోయిందన్నారు. తక్షణమే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ప్రసాద్, నరసింహులు, సలాం, రవి, గోవిందరాజులు పాల్గొన్నారు.

జిల్లాలోనే శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రాన్ని జిల్లాలోనే ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్‌అజీజ్, షమీంబాన్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. 400 కి.మీ సుదూరంలో హిందూపురంలో ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడాన్ని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ పక్షాన పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. చిన్నపిల్లలు, వృద్ధాప్య తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత మహిళా ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి శిక్షణా కార్యక్రమాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఎండీ ఖాశీం, షబానాపర్వీన్, పర్వీనుబాను, హసీనా తదితరులు పాల్గొన్నారు.

జూడోలో సత్తాచాటిన క్రీడాకారులు

నందికొట్కూరు: పట్టణంలోని నవనంది హైస్కూల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి జూడోలో బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ శ్రీధర్ తెలిపారు. రాష్ట్రస్థాయి జూడోలో హిమతేజ, పురందర్ బంగారు పతకం, ఛార్లెస్ రజత పతకం సాధించడంతో మంగళవారం పాఠశాల చైర్మన్, హెచ్ఎం నరసప్ప, కో ఆర్డినేటర్ మౌలాలి అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలాల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: పట్టణంలోని బొమ్మలసత్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఉన్న స్థలం నుంచి మార్పు చేసేందుకు గుర్తించిన ప్రదేశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ.. బొమ్మలసత్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించి ప్రతిష్టించేందుకు గుర్తించిన స్థానిక చిన్న చెరువు, మున్సిపల్ టౌన్ హాల్ ప్రదేశాలను పరిశీలిస్తామన్నారు. వివిధ సంఘాలు ఇచ్చిన ప్రతిపాదనలను కూడా పరిగణలోకి తీసుకొని విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన చోటే రాజ్యాంగశిల్పి విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని చెప్పారు. డీఆర్ఓ పద్మజ, ఆర్డీఓ మల్లికార్జున్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న తాలూకా ఎస్ఐ గంగయ్యయాదవ్

నంద్యాల(సిటీ): పెరుగుతున్న సాంకేతికత పరిజ్ఞానం మంచికి వినియోగించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తాలూకా సబ్ ఇన్‌స్పెక్టర్ గంగయ్యయాదవ్ సూచించారు. మంగళవారం స్థానిక ఎస్‌డీఆర్ పాఠశాలలో పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా పోలీసుల విధులు, సమాజంలో పోలీసు పాత్ర, సమసమాజ నిర్మాణానికి పోలీసుల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశలోనే సైబర్ క్రైమ్, నేరగాళ్ల పట్ల, సైబర్ స్టాకింగ్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సాంకేతికతను దుర్వినియోగం చేయడానికి గాకుండా మన అభ్యున్నతికి ఉపయోగించాలన్నారు. సోషల్ మీడియా వెబ్‌సైట్లలో ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయడం మంచిది కాదన్నారు. కొత్త వ్యక్తులకు, తెలియని సమూహాలకు(గ్రూప్) లలో పరిచయమయ్యే కొత్త వారిని నమ్మి మోసపోవద్దని విద్యార్థులకు సూచించారు. ఆన్‌లైన్‌లో పరిచయమయ్యే కొత్త స్నేహితులతో ఎలాంటి ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దన్నారు. సైబర్ క్రైమ్ సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ముమ్మరంగా రెవెన్యూ గ్రామసభలు



చాగలమర్రి గ్రామసభలో పాల్గొన్న వీఆర్ఓలు



గ్రామ సభలో ఖాళీగా కుర్చీలు

గోస్పాడు: మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభకు 114 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం పొలాల్లో రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహించిందని తెలిపారు. అందులో రైతులకు ఎల్పీఎంకు సంబంధించినవి, విస్తీర్ణంలో తేడాలు, దీంతో పాటు పొలాలకు సంబంధించి ఏ ఇతర సమస్యలు ఉన్నా దరఖాస్తు చేసుకొనేలా రైతులకు అవకాశం కల్పిస్తూ గ్రామాల్లోనే సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు కానాలపల్లెలో గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

అయ్యలూరు సభకు 55 దరఖాస్తులు

నంద్యాల(అర్బన్): మండలంలోని అయ్యలూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రియదర్శిని మాట్లాడుతూ.. గ్రామసభలో 55 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలను సబ్‌డివిజన్‌ల వారీగా పరిష్కరిస్తామన్నారు. సర్వేయర్లు, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండలంలోని గోవిందపల్లె గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు రైతుల నుంచి.. భూముల విస్తీర్ణంలో తేడాలున్నాయని 5 మంది రైతులు వినతిపత్రాలను అందజేశారు. ఈ గ్రామంలో గతంలో 136 మందికి రైతులకు సంబంధించి 606.52 ఎకరాల్లో భూమల రీసర్వే చేయడం జరిగింది. కార్యక్రమంలో డీటీ ప్రసాద్‌బాబు, మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్ఓ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు:రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు. మంగళవారం బుర్రారెడ్డిపల్లె గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పేర్ల మార్పులు, విస్తీర్ణంలో వ్యత్యాసాలు, జాయింట్ పాస్‌పుస్తకాల సవరణ కోసం 10 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. డీటీలు శ్రీనివాసరెడ్డి, మాధవ్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో వీఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లు తప్ప ప్రజలేవ్వరు రాకపోవడం గమనార్హం. ఈ గ్రామ సభలో 10 మంది రైతులు తమ పొలం పాస్‌బుక్‌లలో తప్పులు దొర్లాయని, సరిదిద్దాలని కోరుతూ దరఖాస్తు చేశారని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మండల సర్వేయర్ మద్దిలేటి, విలేజ్ సర్వేయర్ హరి, లీలావతి, వీఆర్ఓలు శారద, వెంకట్రామిరెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



గోవిందపల్లెలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నిర్లక్ష్యంగా సమాధానం

తనకు చాగలమర్రి గ్రామంలో ఉన్న పొలం, ఇంటి స్థలానికి సంబంధించిన సర్వే నంబర్లు, భూవిస్తీర్ణం తప్పుగా పట్టాదారు పాసు పుస్తకాలలో నమోదైందని, ఈ సమస్యపై గ్రామసభలో ఫిర్యాదు చేయగా అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వెనుదిరిగి వచ్చేసినట్లు భాదిత రైతు ఫక్కీర్‌బాషా వాపోయారు.

అతివేగంతో రోడ్డు ప్రమాదాలు



స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుకు పరిశీలన చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున గుప్తా

నంద్యాల(సిటీ): మితిమీరిన వేగంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటాయని, వాటిని నియంత్రించడానికే పోలీసులు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సూచికలు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున గుప్తా అన్నారు. మంగళవారం శాంతిరాం మెడికల్ కళాశాల వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియంత్రణ లేని వేగంతో వాహనాలు నడపడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన సూచికలను అనుసరించి నియంత్రిత వేగంతో ప్రయాణం చేసి సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవాలన్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్స్, మలుపుల వద్ద అప్రమత్తంగా ఉండి నియంత్రిత వేగంతో వాహనాన్ని నడపాలన్నారు. కార్లలో ప్రయాణం చేసేప్పుడు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి వాహనదారులను ఎక్కిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలన్నారు. అనంతరం నేషనల్ హైవే అధికారుల, టోల్ ప్లాజా వారి సహకారంతో శాంతిరాం మెడికల్ కళాశాల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు.